సాక్షి
రాజన్న సిరిసిల్ల
గురువారం । 17 । జూలై । 2025



రాజన్నసేవలో ప్రముఖులు

వేములవాడ: రాజన్నను ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ బుధవారం దర్శించుకున్నారు. ఆయన వెంట ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్, ఈవో రాధాభాయి, ఇతర అధికారులు ఉన్నారు.



విద్యార్థుల నమోదు పెంచాలి

బోయినపల్లి(చొప్పదండి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచాలని డీఈవో వినోద్ సూచించారు. కొదరుపాక హైస్కూల్, ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు.

గరిష్టం/కనిష్టం
31.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. ఉరుములు పడే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. వేగంగా గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

కళాశాలల్లో ప్రవేశాలు పెంచండి



సిరిసిల్లకల్చరల్: ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్మీడియట్ ప్రవేశాలు పెంచేందుకు లెక్చరర్లు కృషిచేయాలని ఇంటర్‌బోర్డు ప్రత్యేకాధికారి రమణారావు సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం తనిఖీ చేశారు. ఫస్టియర్ అడ్మిషన్ల పెంపు విషయంలో ప్రత్యేకశ్రద్ధ చూపాలన్నారు. ఎప్సెట్, జేఈఈ, నీట్ పోటీపరీక్షల సన్నద్ధతకు 'ఫిజిక్స్‌వాలా' వంటి సాంకేతికతను వినియోగిస్తున్న విషయాన్ని ప్రచారం చేయాలని సూచించారు. డీఈవో శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపాల్ కనకశ్రీ విజయరఘునందన్, అధ్యాపకులు ఉన్నారు.

'అధికంగా వసూలు చేయరాదు'



తంగళ్లపల్లి(సిరిసిల్ల): ట్రాక్టర్ యజమానులు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారలు నుంచి అధిక ధరలు వసూలు చేయరాదని తంగళ్లపల్లి తహసీల్దార్ జయంత్‌కుమార్ స్పష్టం చేశారు. స్థానిక మండల పరిషత్‌లో బుధవారం ఇందిరమ్మ కమిటీ, ట్రాక్టర్ యజమానులతో మండల అధికారులు సమావేశమయ్యారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. వారంలో రెండు రోజులు ఇసుకను బుధ, శుక్రవారాలు, మట్టిని మంగళ, గురువారాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు తీసుకోవాలని సూచించారు. డీఆర్డీవో శేషాద్రి, ఎంపీడీవో లక్ష్మీనారాయణ, ఎంపీవో మీర్జా అఫ్జల్‌బేగ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు టోని, చెన్నమనేని ప్రశాంత్, ట్రాక్టర్ యజమానులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

- డీఎంహెచ్‌వో రజిత



బోయినపల్లి(చొప్పదండి): సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు స్కూల్, హాస్టల్స్ తరచూ సందర్శించి విద్యార్థులకు ఆరోగ్య సూచనలు చేయాలని డీఎంహెచ్‌వో రజిత సూచించారు. మండలంలోని కోరెం, తడగొండ సబ్‌సెంటర్లను బుధవారం తనిఖీ చేశారు. సబ్‌సెంటర్లలోని రికార్డులను పరిశీలించారు. పిల్లలకు వ్యాక్సిన్ వేసిన తర్వాత అరగంట సేపు పరిశీలనలో ఉంచాలని సూచించారు. టీబీ, లెప్రసీ వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి సంపత్, జిల్లా టీబీ, లెప్రసీ ప్రోగ్రాం అధికారి అనిత, జిల్లా ఎన్‌సీడీ అధికారి రామకృష్ణ, సబ్‌సెంటర్ ఆరోగ్య కార్యకర్తలు వసంత తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

- 'సెస్' ఎండీ సుబ్బారెడ్డి

సిరిసిల్ల: జిల్లా కేంద్రంలోని విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు శుక్రవారం పద్మనాయక ఏసీ ఫంక్షన్‌హాల్‌లో సమావేశం నిర్వహిస్తున్నట్లు 'సెస్' ఇన్‌చార్జి మేనేజింగ్ డైరెక్టర్ సుబ్బారెడ్డి బుధవారం తెలిపారు. విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక-2, (సీజీఆర్ఎఫ్-2) నిజామాబాద్ చైర్‌పర్సన్ నారాయణ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు వివరించారు. పట్టణంలోని విద్యుత్ వినియోగదారులు హాజరై సమస్యలను వివరించాలని కోరారు.

తరచూ మరమ్మతులు



ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్‌లో తాగునీటి పైపులైన్లు తరచూ పగిలిపోతున్నాయి. మెయిన్ రోడ్డు కిందే పైపులైన్ ఉండడంతో భారీ వాహనాల రాకపోకలతో ధ్వంసమవుతున్నాయి. దీంతో నీటి సరఫరాలో తరచూ అవంతరాలు ఎదురవుతున్నాయి. సర్దార్ పాపన్న విగ్రహం నుంచి అంబేడ్కర్‌నగర్ ప్రాథమిక పాఠశాల వరకు ఇప్పటికే నాలుగుచోట్ల పైపులు పగిలిపోయాయి. పక్షం రోజులుగా పంచాయతీ అధికారులు మరమ్మతులు చేయిస్తున్నా నీరు లీకవుతుంది. దీనిపై కార్యదర్శి రమేశ్ మాట్లాడుతూ కొత్తగా పైపులైన్ పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

ఇలాగైతే భద్రత ఎలా?



సిరిసిల్లలోని పలు ప్రైవేట్ స్కూళ్లకు ఆటోలలో వచ్చే విద్యార్థులు ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. ఆటోలకు వెనుక వైపు జాలీలు లేకపోవడంతో ఏమాత్రం కుదుపు వచ్చినా కిందపడే ప్రమాదకర పరిస్థితులు ఉన్నాయి. అందరూ పదేళ్లలోపు పిల్లలే కావడంతో జాగ్రత్తగా పట్టుకోవాలన్న ఆలోచన కూడా వారికి ఉండదు. తెలిసీతెలియని చిన్నారులను ఇంత ప్రమాదకరంగా ఆటోలలో తీసుకెళ్తున్నా డ్రైవర్లను కనీసం హెచ్చరించేవారు కరువయ్యారు. అధికారులు సైతం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. బరువైన పుస్తకాల బ్యాగులను వారే టాప్‌పైకి ఎత్తి వేసుకుంటున్నారు. అంతా సాఫీగా సాగితే ఫరవాలేదు. కానీ ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యులు ఎవరనేదానికి సమాధానం లేదు. ఇప్పటికైనా తల్లిదండ్రులు, యాజమాన్యాలు బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్నసిరిసిల్ల









అవి 'నీటి' అంతస్తులు

- ఏసీబీ దాడుల్లో వెలుగుచూస్తున్న అంతులేని ఆస్తులు
- ఈఎన్‌సీ మురళీధర్‌రావు జిల్లా వాసే..
- అందరూ జిల్లాలో పనిచేసిన వారే..
- బయటికొస్తున్న రూ.వందల కోట్లు

సాక్షి పరిశీలన

సిరిసిల్ల వద్ద మధ్యమానేరు బ్యాక్ వాటర్(ఫైల్)



సిరిసిల్ల: అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) శాఖ రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్న దాడుల్లో దొరుకుతున్న అధికారులకు జిల్లాతో అనుబంధం ఉంది. కొందరు ఇక్కడ నిర్మించిన ప్రాజెక్టుల పనుల్లో పనిచేయగా.. ఈఎన్‌సీ మురళీధర్‌రావు జిల్లా వాసే. ఏసీబీ దాడుల్లో భారీగా ఆస్తులు వెలుగుచూస్తున్న ఉన్నతాధికారులందరూ కాళేశ్వరం ప్రాజెక్టులో పనిచేసిన వారే కావడం గమనార్హం. ఆదాయానికి మించి ఆస్తులు సంపాదించినట్లు వెలుగుచూస్తోంది. వీరి భారీ అవినీతిపై జిల్లాలో ఆసక్తికర చర్చ సాగుతోంది.

భారీ నిర్మాణాలు

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా బోయినపల్లి మండలం మాన్వాడ వద్ద మధ్యమానేరు, ఇల్లంతకుంట మండలం అనంతగిరి వద్ద అన్నపూర్ణ జలాశయం, కోనరావుపేట మండలం మల్కపేట వద్ద రిజర్వాయర్ పనులు చేపట్టారు. సిరిసిల్ల నుంచి మల్కపేట జలాశయం వరకు సొరంగం పనులు, సర్జిపూల్స్, కెనాల్స్ నిర్మాణాలు చేపట్టారు. ఈ పనుల్లో అవినీతి జరిగినట్లు అధికారులు భావిస్తున్నారు. ఏసీబీ అధికారుల సోదాల్లో పట్టుబడుతున్న ఆస్తులను చూసి వారే నివ్వెరపోతున్నారు.

మురళీధర్‌రావు మన జిల్లా వాసి

నీటిపారుదలశాఖలో చీఫ్ ఇంజినీర్‌గా రిటైర్డు అయిన తరువాత.. కాళేశ్వరం ప్రాజెక్టు ఈఎన్‌సీగా పనిచేసిన చీటి మురళీధర్‌రావు స్వస్థలం కోనరావుపేట మండలం కొండాపూర్. నీటిపారుదల శాఖలో ఇంజినీర్‌గా ఉద్యోగంలో చేరిన మురళీధర్‌రావు అంచెలంచెలుగా ఎదిగి సీఈగా రాష్ట్రస్థాయిలో పనిచేసి రిటైర్డు అయ్యారు. ఆయన తండ్రి గోవిందరావు డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేసి రిటైర్డు అయ్యారు. జిల్లాలోని మెట్టప్రాంతాలను సస్యశ్యామం చేసే కాళేశ్వరం 9వ ప్యాకేజీ పనులను, 10, 11, 12వ ప్యాకేజీ పనులను పూర్తి చేయించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిపోయిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కమిటీ ఎదుట పలుమార్లు హాజరయ్యారు. ప్రాజెక్టు డిజైన్‌లో లోపాలు, ఇతర అంశాలపై 'తెలియదు.. గుర్తు లేదనే' సమాధానాలు ఇచ్చినట్లు ప్రచారంలో ఉంది. అవినీతి నిరోధక శాఖ అధికారులు మురళీధర్‌రావు సోదరులు నివసిస్తున్న కరీంనగర్‌లోని వారి ఇళ్లలోనూ సోదాలు చేయడం గమనార్హం.



చీటి మురళీధర్‌రావు, రిటైర్డు ఈఎన్‌సీ



హరిరాం, కాళేశ్వరం 9వ ప్యాకేజీ ఈఎన్‌సీ



శ్రీధర్, కాళేశ్వరం ప్రాజెక్టు ఈఈ

ఒక్కొక్కరుగా జైలుకు..

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ సమయంలో పనిచేసిన మరో ఈఎన్‌సీ హరిరాం ఆదాయానికి మించి ఆస్తులు సంపాదించినట్లు గుర్తించిన ఏసీబీ అధికారులు అరెస్ట్ చేసి జైలుకు పంపించారు. అంతకుముందే ఈ ప్రాజెక్టులో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేసిన శ్రీధర్ ఇళ్లలోనూ సోదాలు చేసి భారీగా ఆస్తులు ఉన్నట్లు గుర్తించి అరెస్ట్ చేశారు. మరో ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లు పలుమార్లు కాళేశ్వరం ప్రాజెక్టుపై నియమించిన కమిషన్ ఎదుట హాజరై తన వాంగ్మూలం ఇచ్చారు. మొత్తంగా కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి కీలకంగా ఉన్న ఇంజినీర్లను జైలుకు పంపించగా... రిటైర్డు అయిన అధికారులపైనా నిఘా ఉంచినట్లు తెలిసింది.

రూ.400కోట్లకు పైగానే..

ఏసీబీ దాడుల్లో దొరికిన ఇరిగేషన్ అధికారుల ఆస్తుల చిట్టా చూస్తే కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. ఖరీదైన విల్లాలు, బంగారు నగలు, నగదు అన్ని కలిపి రూ.400కోట్లకు పైగానే అక్రమంగా కూడబెట్టినట్లు తెలుస్తోంది.

జలాశయాలు వెలవెల

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా జిల్లాలో నిర్మించిన జలాశయాలు నేడు నీరు లేక వెలవెలబోతున్నాయి. 25 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో నిర్మించిన మధ్యమానేరులో ప్రస్తుతం 5 టీఎంసీల నీరుంది. ఇల్లంతకుంటలోని అనంతగిరి అన్నపూర్ణ ప్రాజెక్టు సామర్థ్యం 3 టీఎంసీలు కాగా ప్రస్తుతం అర టీఎంసీ మాత్రమే నీరు ఉంది. 3 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన కోనరావుపేట మండలం మల్కపేట రిజర్వాయర్‌లోనూ 0.5 టీఎంసీ మాత్రమే నీరు ఉంది. ఇలా గోదావరి జలాలు జిల్లాకు పంపింగ్ ద్వారా రాకపోవడంతో జలాశయాలు బోసిపోయాయి. భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. రైతుల సంగతి ఎలా ఉన్నా జిల్లాలో ప్రాజెక్టుల నిర్మాణంలో అవినీతి అలుగుదుంకి పారినట్లు తాజాగా ఏసీబీ అధికారుల దాడుల్లో బయటపడుతున్న ఆస్తులే వెల్లడిస్తున్నాయి.

నేడు సిరిసిల్లకు కేటీఆర్ రాక

- పార్టీ నాయకులు, కార్యకర్తలతో ముఖాముఖి సమావేశం

సిరిసిల్ల: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, స్థానిక ఎమ్మెల్యే కె.తారక రామారావు గురువారం సిరిసిల్లకు వస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య బుధవారం తెలిపారు. సిరిసిల్ల నియోజకవర్గంలోని అన్ని మండలాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో తెలంగాణ భవన్‌లో వేర్వేరుగా సమావేశమవుతారని పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి బయలుదేరి సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌కు చేరుకుంటారని తెలిపారు. ఉదయం ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట మండలాల నాయకులతో సమావేశమవుతారని మధ్యాహ్న భోజనం అనంతరం వీర్నపల్లి, ముస్తాబాద్, తంగళ్లపల్లి మండలాల నాయకులతో మాట్లాడుతారని వివరించారు. అన్ని మండలాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సమయానికి చేరుకోవాలని కోరారు.



కేటీఆర్



సర్కార్ బడిలో 450 మంది

ముస్తాబాద్(సిరిసిల్ల): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వందలాది మంది విద్యార్థులతో కళకళలాడుతోంది. ఇరవై ఏళ్ల క్రితం జెడ్పీ బాలుర పాఠశాల నుంచి ప్రత్యేకంగా బాలికల పాఠశాలగా ప్రభుత్వం మంజూరు చేసింది. బాలికల పాఠశాలను సక్సెస్ స్కూల్‌గా గుర్తించడంతో ప్రవేశాలు పెరిగాయి. అదే సమయంలో బాలుర పాఠశాలలో సంఖ్య తగ్గిపోయింది. ఒకే ఆవరణలో రెండు స్కూళ్లు ఉండడంతో తరచూ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఇబ్బందులు పడ్డారు. చాలా రోజులుగా రెండు స్కూళ్లను కలపాలని స్థానికులు కోరుతూ వచ్చారు. బాలుర పాఠశాలలో పదేళ్లుగా విద్యార్థుల సంఖ్య తగ్గుతుండడంతో అధికారులు రెండు పాఠశాలలను కలుపుతూ ఉత్తర్వులు జారీ చేశారు. బాలికల పాఠశాల హెచ్ఎం రవీందర్‌ను పెద్దూరుకు బదిలీ చేయగా, బాలుర పాఠశాల హెచ్ఎం, ఎంఈవో రాజిరెడ్డికి బాధ్యతలు అప్పగించారు. మొదటి రోజు బుధవారం 450 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులతో సందడిగా మారింది.

8,552 మహిళా సంఘాలకు రూ.12 కోట్లు

- రుణాలకు వడ్డీ చెల్లింపులు
- నేడు వేములవాడలో పంపిణీ

మహిళాశక్తి లోగో



మహిళా సంఘాల సభ్యులు (ఫైల్)

సిరిసిల్ల: జిల్లాలోని స్వయం సహాయక మహిళా సంఘా(ఎస్‌హెచ్‌జీ)లకు ఇందిరా మహిళాశక్తిలో తీసుకున్న బ్యాంకు రుణాలకు ప్రభుత్వం వడ్డీ చెల్లించనుంది. 2024–2025 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మధ్య కాలంలో తీసుకున్న బ్యాంకు రుణాలను సకాలంలో చెల్లించిన 8,552 సంఘాలకు రూ.12కోట్ల వడ్డీ డబ్బులను మంజూరు చేసింది. వేములవాడ నియోజకవర్గంలో గురువారం, సిరిసిల్ల నియోజకవర్గంలో శుక్రవారం ఈ వడ్డీ సొమ్మును మహిళా సంఘాలకు పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వేములవాడ అర్బన్ మండలంలోని 365 సంఘాలకు రూ.46.84లక్షలు, వేములవాడ రూరల్‌లో 442 సంఘాలకు రూ.58.81లక్షలు, చందుర్తిలో 613 సంఘాలకు రూ.82.50 లక్షలు, రుద్రంగిలో 325 సంఘాలకు రూ.41.61 లక్షలు, కోనరావుపేట మండలంలోని 910 ఎస్‌హెచ్‌జీలకు రూ.1.13కోట్ల వడ్డీని చెల్లించనున్నారు. తంగళ్లపల్లిలో 926 సంఘాలకు రూ.1.24కోట్లు, గంభీరావుపేటలో 1,004 సంఘాలకు రూ.1.41కోట్లు, ముస్తాబాద్‌లో 1,018 ఎస్‌హెచ్‌జీలకు రూ.1.38కోట్లు, వీర్నపల్లిలో 280 సంఘాలకు రూ.34.76లక్షలు, ఎల్లారెడ్డిపేటలో 1,022 సంఘాలకు రూ.1.50కోట్లు, బోయినపల్లిలో 696 సంఘాలకు రూ.98.90లక్షలు, ఇల్లంతకుంట మండలంలోని 951 ఎస్‌హెచ్‌జీలకు రూ.1.45కోట్ల వడ్డీ డబ్బులు ప్రభుత్వం మంజూరు చేసింది.

పట్టణ, ఆలయాలను అభివృద్ధి చేస్తున్నాం

- గోశాలకు కేబినేట్ ఆమోదం
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



ఆలయం వద్ద ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ: రాజన్న ఆలయం, వేములవాడ పట్టణలను సమాంతరంగా అభివృద్ధి చేస్తున్నామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం విలేకరులతో మాట్లాడారు. రూ.వెయ్యి కోట్లతో పట్టణంలో అభివృద్ధి కార్యక్రమాలకు అంకురార్పణ చేశామన్నారు. ఆలయానికి రూ.150 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. గత ప్రభుత్వం రాజన్న ఆలయానికి ఏటా రూ.100కోట్లు ఇస్తానని మోసం చేసిందన్నారు. 50 ఎకరాల్లో గోశాలను నిర్మించేందుకు క్యాబినేట్ మీటింగ్‌లో నిధులు కేటాయించడం జరిగిందన్నారు. శృంగేరిపీఠం అనుమాతులతో భీమేశ్వర ఆలయంలో త్వరలోనే అభివృద్ధి పనులు ప్రారంభిన్నామన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా
- వెంటనే బెంచీలు పంపించిన వైనం



విద్యార్థితో పాఠ్యాంశం చదివిపిస్తున్న కలెక్టర్

వేములవాడరూరల్: పాఠశాలలోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పంచాయతీ కార్యదర్శి, హెచ్ఎంలకు సూచించారు. వేములవాడరూరల్ మండలం మారుపాక ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ సెంటర్‌లను బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడంపై బడిబాటలో ఏం చేశారని ప్రశ్నించారు. విద్యార్థులకు సరిపడా బెంచీలు లేవని తెలుసుకొని.. వెంటనే పంపించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాఠ్యాంశాలు చదివిపించారు. అనంతరం మెప్మా ఆధ్వర్యంలో పెట్రోల్‌బంక్ ఏర్పాటుకు మారుపాకలోని సర్వేనంబర్ 339లో పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ అన్వేష్, డీటీసీపీవో అన్సర్, పంచాయతీరాజ్, ఇరిగేషన్ అధికారులు ఉన్నారు.



ఇలా వదిలేస్తే.. ఎలా వెళ్లేది?

సిరిసిల్ల: మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యానికి ఇది పరాకాష్ట. పట్టణ శివారులోని చంద్రంపేట ఒకటో వార్డు పరిధిలో పోచమ్మవీధిలో మిషన్‌భగీరథ పైపులైన్ లీకేజీ ఉండగా.. గొయ్యి తవ్వి రిపేరు చేశారు. కానీ ఆ గొయ్యిని పూడ్చకుండా అలాగే వదిలేయడంతో మురికి నీరు, వర్షం నీరు చేరి రోడ్డు బురదమయంగా మారింది. ఆ వీధి గుండా పాఠశాలలకు వెళ్లే పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. సిరిసిల్ల మున్సిపల్ అధికారులు తవ్విన నల్లాపైపు గొయ్యిని పూడ్చివేసి రోడ్డుపై బురదలేకుండా చేయాలని చంద్రంపేట వాసులు కోరుతున్నారు.

క్లుప్తంగా

రాజన్న హుండీ ఆదాయం రూ.1.59 కోట్లు



హుండీ లెక్కింపులో ఆలయ అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల సభ్యులు

వేములవాడ: రాజన్నకు భక్తులు హుండీలలో సమర్పించుకున్న కట్నాలు, కానుకలను ఆలయ అధికారులు బుధవారం లెక్కించారు. రూ.1.59కోట్ల ఆదాయం సమకూరినట్లు ఈవో రాధాభాయి తెలిపారు. బంగారం 279 గ్రాములు, వెండి 14.700 కిలోలు సమకూరింది. ఆలయ అధికారులు సత్యనారాయణ, శ్రవణ్, శ్రీనివాస్, జయకుమారి, అశోక్ పర్యవేక్షించారు.

గంజాయి విక్రేతల రిమాండ్

- 250 గ్రాముల గంజాయి, రెండు మొబైల్ ఫోన్స్ స్వాధీనం



ఇద్దరి నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్న ఎస్సై రాజకుమార్

బోయినపల్లి(చొప్పదండి): ఇద్దరు గంజాయి విక్రేతలను రిమాండ్‌కు తరలించడంతోపాటు వారి నుంచి 250 గ్రాముల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు వేములవాడరూరల్ సీఐ శ్రీనివాస్ బుధవారం తెలిపారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌కు చెందిన వేముల శ్రీనివాస్, వేముల విజయలక్ష్మి మహారాష్ట్రలోని చంద్రపూర్ నుంచి గంజాయి కొనుగోలు చేసి రాజన్నసిరిసిల్ల జిల్లాలోని గ్రానైట్ కార్మికులకు విక్రయిస్తున్నారు. ఈ విషయం తెలియడంతో బుధవారం బోయినపల్లి మండలం కోరేం శివారులో అనుమానాస్పదంగా తిరుగుతున్న వీరిద్దరిని అదుపులోకి తీసుకొని తనిఖీ చేశారు. వారి వద్ద 250 గ్రాముల గంజాయి, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

తడి, పొడి చెత్త వేరు చేయండి



పరిసరాలు పరిశీలిస్తున్న అధికారులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): తడి, పొడి చెత్తను వేరు చేసి పంచాయతీ సిబ్బందికి అప్పగించాలని, వారు ఆ చెత్తను కంపోస్ట్‌షెడ్లకు తరలిస్తారని స్వచ్ఛ సర్వేక్షన్ జిల్లా ఇన్‌చార్జి సురేష్, ఎంపీడీవో సత్తయ్య తెలిపారు. మండలంలోని సింగారం, నారాయణపూర్ గ్రామాల్లో స్వచ్ఛ సర్వేక్షన్ బృందం సభ్యులు బుధవారం సందర్శించారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో చెత్త సేకరణ నిత్యం చేపట్టాలని సూచించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచితే రోగాలు దూరమవుతాయన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్ సభ్యులు అనూష, శిరీష, కార్యదర్శులు పాల్గొన్నారు.

అజ్ఞాతంలో 16మంది కీలకనేతలు

- పెద్దపల్లిలో 10 మంది, మంచిర్యాలలో ఆరుగురు
- జనజీవన స్రవంతిలోకి వచ్చేవారికి పునరావాసం
- లొంగిపోయేలా నిర్బంధం పెంచుతున్న పోలీసులు

రామగుండం పోలీస్‌కమిషనరేట్‌లో మావోయిస్టులు	
పెద్దపల్లి జిల్లా:	మంచిర్యాల జిల్లా:
10	06



మల్లా రాజిరెడ్డి



అప్పాసి నారాయణ



మల్లోజుల వేణుగోపాల్‌రావు



పుల్లూరి ప్రసాద్‌రావు



కంకణాల రాజిరెడ్డి



సలాకుల సరోజ



జాడి వెంకటి



బండి ప్రకాశ్



బబ్బెర రవి

కీలకనేతలు	క్యాడర్	గ్రామం	రివార్డు (రూ.లక్షల్లో)
పెద్దపల్లి జిల్లా			
మల్లా రాజిరెడ్డి	సీసీఎం సెక్రటరీ	ఎగ్లాస్‌పూర్, మంథని	25
అప్పాసి నారాయణ	డీసీఎం, టెక్నికల్‌టీం	రామగుండం	5
గంకిడి సత్యనారాయణరెడ్డి	ఎస్‌సీఎం	సబ్బితం, పెద్దపల్లి	20
మల్లోజుల వేణుగోపాల్‌రావు	సీసీఎం	పెద్దపల్లి టౌన్	25
ఆలేటి రామలచ్చులు	డీసీఎస్	పాలితం, పెద్దపల్లి	8
దాతు అయిలయ్య	కమాండర్	గోపయ్యపల్లి, పెద్దపల్లి	5
పుల్లూరి ప్రసాదరావు	సీసీఎం, గైడింగ్	వడ్కాపూర్, జూలపల్లి	25
దీకొండ శంకరయ్య	కమాండర్	వెంకట్రావుపల్లి, జూలపల్లి	5
కంకణాల రాజిరెడ్డి	ఎస్‌సీఎం	కిష్టంపేట్, కాల్వశ్రీరాంపూర్	20
జువ్వాడి వెంకటేశ్వర్‌రావు	ఏసీఎం	కొదురుపాక, సుల్తానాబాద్	4
మంచిర్యాల జిల్లా			
సలాకుల సరోజ	దండకారణ్య స్పెషల్‌జోన్	కన్నాలబస్తీ, బెల్లంపల్లి	20
ఆరేపల్లి కృష్ణ	ఏసీఎస్	కన్నాలబస్తీ, బెల్లంపల్లి	5
జాడి పుష్ప	డీసీఎం, టెక్నికల్	చంద్రవల్లి, తాళ్లగురిజాల	5
జాడి వెంకటి	ఏసీఎం, టెక్నికల్	చంద్రవల్లి, తాళ్లగురిజాల	20
బండి ప్రకాశ్	సికాస	మందమర్రి	20
బబ్బెర రవి	పార్టీ మెంబర్	మందమర్రి	5

గోదావరిఖని: మావోయిస్టులపై కేంద్రప్రభుత్వం నిర్బంధం పెంచింది. ఒకవైపు వేట కొనసాగిస్తూనే మరోవైపు కీలక మావోయిస్టు నేతల లొంగుబాట్లను పోత్సహిస్తోంది. వరుస ఎన్‌కౌంటర్లలో కీలక నేతలు మృతి చెందగా, కొందరు లొంగుబాటు ఎంచుకుంటున్నారు. గత ఏడాదిలో మావోయిస్టు కీలక నేత నంబాల కేశవరావుతో సహా 357మందికిపైగా నక్సల్స్ మృతి చెందారు. అయితే, బూటకపు ఎన్‌కౌంటర్‌లో 80 మంది వరకు చనిపోగా.. మొత్తం మృతుల్లో 136 మంది మహిళా నక్సల్స్ ఉన్నట్లు మావోయిస్టు పార్టీ తన డాక్యుమెంటరీలో వెల్లడించింది. అనారోగ్యంతో నలుగురు, ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు తెలిపింది.

దండకారణ్యం జల్లెడ..

ఆపరేషన్ కగార్‌లో భాగంగా ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో పోలీసు బలగాలు జల్లెడ పడుతున్నారు. ఆకురాలే కాలంలో మొదలైన ముప్పేట దాడి ఇంకా కొనసాగుతూనే ఉంది. దీంతో కీలక నేతలను కాపాడుకోవడం కోసం, పార్టీ ఉనికి చాటుకోవడం కోసం అగ్రనాయకత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. పార్టీ అంతర్గత వ్యూహం ఏమైనా.. పోలీసులు బలగాలు ఎన్‌కౌంటర్ జరిగిన ప్రతీసారి నక్సల్స్‌పై పైచేయి సాధిస్తూనే ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో పోలీసు నిర్బంధం పెరగడం, ఇదేసమయంలో వారి సమాచారం బయటకు పొక్కడంతో కీలక కేడర్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. ఈక్రమంలో అనారోగ్యంతో బాధపడుతున్న చాలా మంది లొంగిపోయేందుకు యత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. రామగుండం పోలీస్ కమిషనర్ ఎదుట మంగళవారం లొంగిపోయిన మావోయిస్టు దంపతులు ఇదే విషయాన్ని వెల్లడించాడు. దీంతో అనారోగ్యంతో బాధపడే నేతలు జనజీవన స్రవంతిలోకి రావడానికి ఆసక్తి చూపుతున్నారని భావిస్తున్నారు.

కీలకనేతలపై పోలీసుల ఫోకస్..

రామగుండం పోలీసు కమిషరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో కీలక నేతలపై పోలీసులు ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. నక్సల్స్ కుటుంబ సభ్యులను కలవడం, బాగోగులు తెలుసుకుని ఆర్థిక సాయం చేయడం తరచూ చేస్తూనే ఉన్నారు. నక్సల్స్ జనజీవన స్రవంతిలో కలిసేలా సూచించాలని వారికి చెబుతున్నారు.

పునరావాసంపైనా దృష్టి

జనజీవన స్రవంతిలో కలిసేవారిపైనా పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. మావోయిస్టుల నేతలపై ఉన్న రివార్డును వారికే అందజేస్తూ ప్రభుత్వ భూమి, ఇళ్లు, సమాజంలో గౌరవంగా బతికేలా శ్రద్ధ చూపిస్తున్నారు. ఈక్రమంలో మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం పారిపెల్లి గ్రామానికి చెందిన ఆత్రం లచ్చన్న, ఆయన భార్య చౌదరి అంకుబాయి మంగళవారం పోలీసుల ఎదుట లొంగిపోయారు. వీరిపై ఉన్న రూ.25లక్షల రివార్డును వారికే అందజేశారు.

కలవరపెడుతోన్న అనారోగ్య సమస్యలు

మావోయిస్టు పార్టీలో కీలక నేతలు ఐదుపదుల వయసు దాటిన వారే ఉండడంతో నిర్బంధానికితోడు అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నట్లు తెలుస్తోంది. గతంలో మాదిరిగా వైద్య సదుపాయం లభించక చాలామంది మావోయిస్టులు ఇతర రాష్ట్రాలకు వలసపోవడం, మరికొందరు చేసేదేమీ లేక లొంగుబాటు వైపు మొగ్గుచపుతున్నారని తెలిసింది.

లొంగిపోతే పునరావాసం



మావోయిస్టులు తుపాకీతో సాధించేదేమీలేదు. జనజీవన స్రవంతిలో కలిసి బ్యాలెట్ పద్ధతిన పోటీ చేయాలి. ప్రజలకు సేవలు అందించాలి. మారుమూల ప్రాంతాల్లో చైతన్యం పెరిగింది. అభివృద్ధిని స్వాగతిస్తున్నారు. నక్సల్స్ పాత కాలం నాటి సిద్ధాంతాలతో సాధించేదేమీ లేదు. లొంగిపోయే మావోయిస్టులకు అన్నివిధాలా సహరిస్తాం. – అంబర్ కిశోర్ ఝా, పోలీస్ కమిషనర్, రామగుండం

అమ్ముడుపోతున్న ఆధునిక మగ్గాలు



టెక్స్‌టైల్ పార్క్ నుంచి ట్రాక్టర్‌లో తరలిపోతున్న ఆధునిక ర్యాపియర్ లూమ్స్


- మహిళాశక్తి చీరల ఆర్డర్లు లేక..
- తమిళనాడుకు సిరిసిల్ల లూమ్స్
- సర్కారు చేయూత కరువై విక్రయానికి ర్యాపియర్ లూమ్స్

సిరిసిల్ల: రాష్ట్రంలోని తొలి టెక్స్‌టైల్ పార్క్‌లో ఆధునిక మరమగ్గాలు అమ్ముడుపోతున్నాయి. బహిరంగ వస్త్ర మార్కెట్‌తో పోటీపడలేక.. వస్త్రపరిశ్రమ యూనిట్‌లోని ఆధునిక ర్యాపియర్ లూమ్స్‌ను అగ్గువకే అమ్మేస్తున్నారు. ప్రభుత్వ వస్త్రోత్పత్తి ఆర్డర్లు లేక.. మహిళాశక్తి చీరల ఉత్పత్తి ఆర్డర్లు ఇవ్వకపోవడంతో వస్త్రోత్పత్తిదారులు ఆధునిక మగ్గాలను వడ్డికి పావుశేరు అమ్ముకుంటున్నారు. ఒక్కో లూమ్ ధర మార్కెట్‌లో రూ.5 లక్షలు ఉండగా.. ఇప్పుడు రూ.1.40 లక్షలకు అమ్ముకుంటున్నారు. చిన్నతరహా వస్త్రపరిశ్రమలకు తమిళనాడులో మంచి ప్రోత్సాహకాలు ఉండడంతో సిరిసిల్ల ర్యాపియర్ లూమ్స్‌ను తమిళనాడు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. సిరిసిల్ల వస్త్రశ్రమకు ఆధునిక మగ్గాలకు అందించి ఆధునీకరించాలనే లక్ష్యంతో ఉమ్మడి రాష్ట్రంలోనే సిరిసిల్లలో టెక్స్‌టైల్ పార్క్‌ను రెండు దశాబ్దాల కిందట ఏర్పాటు చేశారు. 220 యూనిట్లలో 7వేల మంది కార్మికులకు పని కల్పించాల్సి ఉండగా.. మొన్నటి వరకు 111 పరిశ్రమలు నడిచేవి. ప్రస్తుతం 52 యూనిట్లకు తగ్గిపోయి.. వెయ్యి మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. తాజా పరిణామాల నేపథ్యంలో సర్కారు చేయూత లేక టెక్స్‌టైల్ పార్క్‌లోని యూనిట్లను తెగనమ్ముకుని ఇతర వ్యాపారాల్లోకి వస్త్రోత్పత్తిదారులు షిఫ్ట్ అవుతున్నారు. బొద్దుల వేణు అనే వ్యాపారి 20 ర్యాపియర్ లూమ్స్‌ను అమ్మేసి, మహబూబాబాద్‌లో ఓ ప్రైవేటు ఆస్పత్రిని నెలకొల్పినట్లు సమాచారం. ఆ లూమ్స్‌ను ట్రాక్టర్‌లో సిరిసిల్ల వరకు తరలించి అక్కడి నుంచి భారీ లారీల్లో తమిళనాడుకు తీసుకెళ్తున్నారు. సిరిసిల్లలో నేత కార్మికులకు ఉపాధి కల్పించాల్సిన ఆధునిక మగ్గాలను వస్త్రోత్పత్తిదారులు అమ్ముకోవడం ఇక్కడి పరిస్థితికి అద్దం పడుతుంది.

కళ్ల ముందే 'డబుల్'.. అద్దెకు ట్రబుల్



శాంతినగర్ బైపాస్ పక్కన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల మధ్య పెరిగిన పిచ్చి మొక్కలు



శాంతినగర్ బైపాస్ పక్కన సిద్ధంగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల సముదాయం

నిరుపేదల సొంతింటి కలను నిజం చేసేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఏళ్లుగా నిరుపయోగంగానే ఉంటున్నాయి. నిర్మాణ పనులు పూర్తయినా లబ్ధిదారులకు ఇవ్వడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. కళ్ల ముందే వందలాది ఇండ్లు ఖాళీగా ఉంటుండగా.. పలువురు నిరుపేదలు కిరాయి ఇంట్లో ఉంటూ అద్దె చెల్లించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రంలోని శాంతినగర్ బైపాస్ పక్కన 204 డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఖాళీగా ఉంటున్నాయి. జనం లేకపోవడంతో ఇండ్ల మధ్య పిచ్చిమొక్కలు మొలుస్తున్నాయి. కొన్ని ఇండ్ల కిటికీ అద్దాలు పగిలిపోయాయి. ఇప్పటికైనా అధికారులు వీలైనంత త్వరగా పంపిణీ చేయాలని పలువురు లబ్ధిదారులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్నసిరిసిల్ల

విద్యుత్ సమస్యలపై రైతుల ధర్నా



గంభీరావుపేటలో ధర్నా చేస్తున్న రైతులు

గంభీరావుపేట/గన్నేరువరం: అప్రకటిత కరెంటు కోతలు, లోవోల్టేజీ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలో రైతులు బుధవారం ధర్నాకు దిగారు. రైతులు మాట్లాడుతూ వానాకాలం పంటల సాగు పనులు ముమ్మరంగా జరుగుతున్న సమయంలో కరెంటు కోతలు పెరిగాయన్నారు. లోవోల్టేజీతో విద్యుత్‌మోటార్లు, స్టార్టర్లు కాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గంభీరావుపేటలో సెస్ ఏఈ అనంద్‌కుమార్ రైతులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయండి

గద్దె నిర్మించినా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడం లేదని కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం చాకలివానిపల్లిలో రైతులు రోడ్డెక్కారు. వర్షాలు లేక ఇబ్బందులు పడుతుంటే.. ట్రాన్స్‌ఫార్మర్ లేక పొలాలకు నీరు అందించలేని పరిస్థితి నెలకొందన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ అమర్చి పంటలను కాపాడాలని కోరారు.

వాహిని షాపింగ్‌మాల్ ప్రారంభం





వివిధ రకాల శారీ డిజైన్లు పరిశీలిస్తున్న అనుపమ పరమేశ్వరన్, షాపింగ్ మాల్ ఎదుట ప్రజల సందడి

కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్‌లోని ఉస్మాన్‌పురలో నూతనంగా ఏర్పాటుచేసిన వాహిని షాపింగ్ మాల్‌ను బుధవారం ప్రముఖ సినీనటి అనుపమ పరమేశ్వరన్, జాజూ శారీస్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వాహకులు ఓం ప్రకాశ్‌జీ జాజూ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. షాపింగ్‌మాల్‌లో వివిధ రకాల వస్త్రాల డిజైన్లు పరిశీలించి, బాగున్నాయన్నారు. 'హాయ్ కరీంనగర్.. ఎలా ఉన్నారు' అని సినీనటి అనుపమా పరమేశ్వరన్ అభిమానులను పలుకరించారు. షాపింగ్‌మాల్ యజమాని వేముల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తమ షాపింగ్‌మాల్ ప్రారంభానికి వచ్చిన కస్టమర్లకు, ప్రజలకు, శ్రేయోభిషులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వేణుభాయ్ జాజు, కమల్ భాయ్ జాజు, వేముల శ్రీనివాస్, విష్ణు, దేవరాజ్, నాగరాజ్, శ్రీకాంత్, మెండె అనిల్ కుమార్, గడ్డం అభిషేక్, కొమురవెల్లి రవితేజ, గాజుల అరుణ్‌కుమార్, ప్రశాంత్, దీకొండ రాజు పాల్గొన్నారు.

స్పందిస్తున్న హృదయాలు

- అజయ్‌కి అండగా ఆరోగ్యశాఖ మంత్రి
- మెరుగైన చికిత్స కోసం నిమ్స్‌కు తరలింపు

సాక్షి స్పందన

వీణవంక: వీణవంక మండలం బేతిగల్ గ్రామానికి చెందిన సుద్దాల అజయ్ వినాయక విగ్రహాల తయారీకేంద్రంలో గాయపడి అచేతనస్థితిలో ఆసుపత్రిలో కొట్టుమిట్టాడుతున్న సంగతి తెలిసిందే. ఆపరేషన్‌కు రూ.10లక్షలు ఖర్చవుతుండటంతో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడటంపై 'సాక్షి'లో బుధవారం 'నిరుపేదకు పెద్ద కష్టం' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ సంఘటనపై సీఎంవో కార్యాలయం, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కార్యాలయం నుంచి ఆరా తీశారు. అజయ్ కుటుంబసభ్యులకు ఫోన్ చేసి వాకాబు చేశారు. హైదరాబాద్‌లోని నిమ్స్‌లో మెరుగైన చికిత్స అందిస్తామని హామీ ఇచ్చారు. అజయ్‌కి మెరుగైన వైద్యం అందించాలని వరంగల్ జిల్లా వైద్యాధికారికి ఆదేశాలు జారీ చేయడంతో హుటాహుటిన అజయ్ చికిత్స పొందుతున్న ఆసుపత్రికి వెళ్లి ఆరా తీశారు. దగ్గరుండి నిమ్స్‌కు తరలించారు. కాగా.. పలువురు దాతలు ఇప్పటి వరకు రూ.1.20 లక్షల సాయం అందించారు.

ఎమ్మెస్సార్ సతీమణి సుగుణ మృతి



మేనేని సుగుణ (ఫైల్)

కరీంనగర్: దివంగత మాజీ మంత్రి, మాజీ పీసీసీ అధ్యక్షుడు ఎం.సత్యనారాయణరావు సతీమణి మేనేని సుగుణ(85) తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్‌లోని తన నివాసంలో మృతి చెందారు. వారి అంత్యక్రియలు హైదరాబాద్‌లోని మహాప్రస్థానంలో గురువారం మధ్యాహ్నం 12గంటలకు జరుగనున్నాయి. ఎమ్మెస్సార్ సతీమణి సుగుణదేవి మరణం బాధకరమని ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ఒక ప్రకటనలో నివాళి అర్పించారు.

పదిరలో చిరుత సంచారం

- ఆనవాళ్లు గుర్తించిన అధికారులు



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం పదిర శివారులోని వ్యవసాయ పొలాల్లో మంగళవారం రాత్రి చిరుత సంచరించింది. గ్రామానికి చెందిన ఎదునూరి శ్రీనివాస్ పొలంలో చిరుత పాదముద్రలను అటవీశాఖ అధికారులు గుర్తించారు. దీంతో అటువైపుగా రైతులు రాత్రిపూట వెళ్లవద్దని సెక్షన్ అధికారి సకారాం సూచించారు. మండలంలోని రాగట్లపల్లి, నారాయణపూర్, పదిర, హరిదాస్‌నగర్‌లలోనే వారం నుంచి చిరుత సంచరిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అటవీశాఖ అధికారులు వెంటనే చిరుతను బంధించాలని రైతులు కోరుతున్నారు.

ముగ్గురు గల్ఫ్ ఏజెంట్లపై కేసు

వేములవాడరూరల్: యువకుడి మృతికి కారకులైన ముగ్గురు గల్ఫ్ ఏజెంట్లపై కేసు నమోదు చేసినట్లు వేములవాడ రూరల్ ఎస్సై అంజయ్య తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం వివరాలు. వేములవాడరూరల్ మండలం నూకలమర్రికి చెందిన ఓ యువకుడు ముగ్గురు ఏజెంట్ల ద్వారా సౌదీకి వెళ్లాడు. ఈ క్రమంలో సౌదీలో సరైన పని ఇవ్వకపోవడం, చిత్రహింసలకు గురై హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతిచెందిన విషయం తెలిసిందే. యువకుడి మృతికి కారకులైన వేములవాడ రూరల్ మండలం నూకలమర్రికి చెందిన మేడుదుల రవి, వేములవాడఅర్బన్ మండలానికి చెందిన బొగ్గుల రాజేందర్, కామారెడ్డి జిల్లా డిచ్‌పల్లి మండలం ఇస్లాపూర్‌కు చెందిన షేక్ కుర్షీద్ అహ్మద్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సక్రమంగా లేని సర్దుబాటు

సిరిసిల్ల ఎడ్యుకేషన్: జిల్లాలో ఉపాధ్యాయుల సర్దుబాటు సరిగా లేదని టీఆర్టీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బుర్ర కృష్ణప్రసాద్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బోయన్నగారి నారాయణ పేర్కొన్నారు. సిరిసిల్లలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లేకుండా చేసిన ఉపాధ్యాయుల సర్దుబాటు అనేక మందికి ఇబ్బందిగా ఉందన్నారు. బడిబాట తర్వాత పాఠశాలలో పెరిగిన విద్యార్థులకు సంఖ్యకు అనుగుణంగా వర్క్ అడ్జస్ట్‌మెంట్ చేయాల్సి ఉండగా.. గతేడాది సంఖ్య ఆధారంగా సర్దుబాటు చేశారని ఆరోపించారు. నిబంధనల ప్రకారం సర్దుబాటు చేయలేదన్నారు. ఇప్పటికైనా తప్పులను సరిచేయాలని కోరారు.



ఏపీకే ఫైల్ లింక్‌తో రూ.46వేలు మాయం

- పోలీసులను ఆశ్రయించిన బాధితుడు



బ్యాంక్ నుంచి ఖాళీ అయిన డబ్బుల వివరాలను చూపుతున్న అంజయ్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): తెలిసిన వ్యక్తి పంపిన మెసేజ్ కదా.. అని ఏపీకే ఫైల్ లింక్ క్లిక్ చేయగా బ్యాంక్ ఖాతా ఖాళీ కావడంతో బాధితుడు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడు రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం దుమాలకు చెందిన పెరుమాండ్ల అంజయ్య తెలిపిన వివరాలు. ఈనెల 13న సాయంత్రం తనకు పరిచయం ఉన్న వ్యక్తి మొబైల్ నుంచి తమ సంఘం గ్రూప్‌లో పీఎం కిసాన్ పేరిట ఏపీకే లింక్ రాగా.. ఓపెన్ చేశాడు. 14వ తేదీ రాత్రి 2 నుంచి 3.30 గంటల వరకు ఖాతాలో నుంచి దఫదఫాలుగా రూ.46వేలు కాజేశారు. వెంటనే 1930కి కాల్ చేశాడు. అంతేకాకుండా ఎల్లారెడ్డిపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అదే గ్రామానికి చెందిన న్యాలకంటి సతీశ్ ఖాతా నుంచి గతేడాది డిసెంబర్ 9న సైబర్ నేరగాళ్లు రూ.96వేలు కాజేశారు.


తిరుపతికి మరో ప్రత్యేక రైలు

- నాందేడ్ వయా కరీంనగర్ మీదుగా
- ఆగస్టు 2 నుంచి ప్రారంభం



తిరుపతి ప్రత్యేక రైలు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ రైల్వేస్టేషన్ నుంచి తిరుపతికి మరో ప్రత్యేక రైలు నడిపించేందుకు దక్షిణమధ్య రైల్వే అధికారులు చర్యలు చేపట్టారు. ఆగస్టు2 నుంచి 31 వరకు ఈ ప్రత్యేక రైలు అందుబాటులో ఉంటుంది. ఇప్పటికే కరీంనగర్ నుంచి తిరుపతికి ఒక రెగ్యులర్ రైలుతోపాటు మరో ప్రత్యేక రైలు నడుస్తోంది. సోమ, గురు, ఆదివారం ఈ రైళ్లు కరీంనగర్ నుంచి తిరుపతికి నడుస్తుండగా కొత్త రైలు ప్రతి శనివారం నాందేడ్ నుంచి కరీంనగర్ మీదుగా వెళ్తుంది. ఆదివారం సాయంత్రం తిరుపతి నుంచి కరీంనగర్ మీదుగా నాందేడ్‌కు వెళ్తుంది. ప్రతి శనివారం నాందేడ్‌లో సాయంత్రం 4.50గంటలకు బయల్దేరి ఆదివారం ఉదయం 11.30గంటలకు తిరుపతికి చేరుకుంటుంది. అదేరోజు రాత్రి 7.45గంటలకు తిరుపతి నుంచి బయల్దేరి సోమవారం ఉదయం 9.08గంటలకు కరీంనగర్‌కు చేరుకుంటుంది. ప్రత్యేక రైలును ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కరీంనగర్ రైల్వేస్టేషన్ కమర్షియల్ ఇన్స్‌పెక్టర్ భానుచందర్ కోరారు.



48గంటల్లో కేసు ఛేదన



వివరాలు వెల్లడిస్తున్న సీఐ లక్ష్మీనారాయణ

ఇల్లందకుంట: పాఠశాలలో జరిగిన దొంగతనాన్ని పోలీసులు 48 గంటల్లో ఛేదించారు. ఇందుకు సంబంధించిన వివరాలను సీఐ లక్ష్మీనారాయణ, ఇల్లందకుంట ఎస్సై ఎస్సై క్రాంతికుమార్‌తో కలిసి వివరించారు. ఈనెల 11న ఇల్లందకుంట జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో మూడు ఫ్యూజులు, మూడు సీసీ కెమెరాలు చోరీకి గురయ్యాయి. ఇదే పాఠశాలలో 9,10వ తరగతి చదువుతున్న ముగ్గురు విద్యార్థులు చోరీ చేసినట్లు గుర్తించారు. వారిపై కేసు నమోదు చేసి కరీంనగర్ జువైనల్ కోర్టులో హాజరుపరిచారు.

జ్యోతిష్మతిలో ఎంపవరింగ్ ఇన్నోవేటర్స్



మాట్లాడుతున్న కె.సి.చౌదరి

తిమ్మాపూర్: మండలంలోని జ్యోతిష్మతి ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థుల్లో ఆవిష్కరణ, వ్యవస్థాపకత, స్టార్టప్ అభివృద్ధిని పెంపొందించడానికి ఎంపవరింగ్ ఇన్నోవేటర్స్–ఏ గైడ్ టు ఎంటర్ ప్రెన్యూషిప్ అనే అంశంపై ఒక సెషన్ నిర్వహించినట్లు కళాశాల చెర్మన్ జువ్వాడి సాగర్‌రావు తెలిపారు. నిర్మాణాత్మక ఇంక్యుబేషన్ మద్దతు ద్వారా స్వయం సమృద్ధి, ఆర్థిక సాధికారతను ప్రోత్సహించే లక్ష్యంతో భారత ప్రభుత్వ సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖతో అనుసంధానించబడిన సంస్థాగత చొరవలో భాగంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు సెక్రటరీ, కార్యదర్శి జె.సుమిత్‌సాయి తెలిపారు. భారత ప్రభుత్వ ఎంఎస్‌ఎంఈ మాజీ అసిస్టెంట్ డైరెక్టర్ కె.సి.చౌదరి మాట్లాడుతూ.. విద్యార్థులకు విలువైన సందేశాలు అందించారు. జేఎన్టీయూ ప్రొఫెసర్ జయలక్ష్మి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.అనిల్‌కుమార్, డీన్ అకాడమిక్స్ అండ్ ఆడిట్ డాక్టర్ పీకే వైశాలి, విభాగాధిపతి డాక్టర్ ఆర్.జగదీషన్, ప్రోగ్రాం కోఆర్డినేటర్లు డా.పి.ప్రణీత, జి.సింధుష తదితరులు పాల్గొన్నారు.

